క్లుప్తంగా

మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: మండలంలోని హెచ్. కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసం ఏకాదశి సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ అనంతరం మహామంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు మాన్యం కౌలుకు వేలం

ఉయ్యాలవాడ : స్థానిక అగస్తీశ్వర స్వామి, కోదండ రామస్వామి, ఆలయ భూములు ఏడాది కాల వ్యవధి కౌలు సాగు కోసం మంగళవారం అగస్తీశ్వర ఆలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆయా ఆలయాలకు చెందిన 51 ఎకరాలకు నిర్వహించే వేలంలో పాల్గొనే రైతులు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

ఆలయ భూములకు వేలం

దొర్నిపాడు: కొండాపురం గ్రామంలోని శ్రీసిద్ధేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 28.01 ఎకరాల మాన్యం కౌలుకు ఈఓ చంద్రుడు సోమవారం వేలం నిర్వహించారు. గతేడాది రూ.4.16 లక్షలకు వేలం పలుకగా, ఈ సారి రూ.5.44 లక్షలకు రైతులు దక్కించుకున్నారు. దీంతో ఆలయానికి రూ.1.28లక్షల ఆదాయం లభించింది. క్రిష్టిపాడులో నిర్వహించాల్సిన వేలంను రద్దు చేసి ఈనెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఈఓ చెప్పారు. మాజీ సొసైటీ చైర్మన్లు డీలర్ శివుడు, సిద్దిసత్యం పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

రుద్రవరం: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని మండలంలోని పెద్దకంబలూరుకు చెందిన భవాని ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. భవానికి మూడేళ్ల క్రితం ప్రకాశం జిల్లా బెస్తవారి పేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తిరుపతితో పెద్దలు వివాహం జరిపించారు. పెళ్లి అయిన కొద్ది రోజుల నుంచి భర్తతో పాటు అత్త కోటమ్మ, మామ నారాయణ ముగ్గురు అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధించేవారు. అయినప్పటికీ ఆమె సర్దుకొని పోయేది. గత కొద్ది రోజుల నుంచి వేధింపులు అధికం కావడంతో భరించలేక పుట్టింటికి వచ్చేసింది. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఘర్షణ..కేసు నమోదు

చాగలమర్రి: మండలంలోని డి.కొత్తపల్లె గ్రామానికి చెందిన ఏర్వ అరుణ అనే మహిళకు అదే గ్రామానికి చెందిన ఏర్వ శివ కోనిరెడ్డి మధ్య డబ్బుల విషయంలో విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే శివ కోనిరెడ్డి తనను అసభ్య పదజాలంతో దూషించాడని, అడ్డు వచ్చిన తన భర్త రాజగోపాల్‌రెడ్డి, బంధువైన రవికుమార్‌రెడ్డిపై దాడి చేశాడని అరుణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏర్వ శివ కోనిరెడ్డిపై సోమవారం కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

బస్సు దిగుతూ..

- కింద పడి వ్యక్తికి గాయాలు
- చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలింపు

చాగలమర్రి: బస్సు దిగుతూ ప్రమాదవశాత్తూ కిందపడి వ్యక్తి గాయాలపాలైన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. కండక్టర్ రాణి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కేరళ



పోలీసులు స్వాధీనం చేసుకున్న బస్సు

ఆసుపత్రి సమీపంలోని రిక్వెస్ట్ స్టాప్ వద్ద ప్రొద్దుటూరు నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్న ఏపీ 39 యూజీ 7340 అను నంబరు గల బస్సు నుంచి దిగబోయి ప్రమాదవశాత్తు జారి కిందపడి గొడిగనూరు గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ అనే వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ప్రథమ చికిత్స నిమిత్తం కేరళ ఆసుపత్రికి తరలించారు. రిక్వెస్ట్ స్టాప్ వద్ద నవీన్‌కుమార్ తనకు సంబంధించిన వ్యక్తులతో పాటు బస్సు ఎక్కాడు. వారిని బస్సు ఎక్కించి ఆయన కిందకు దిగేందుకు ప్రయత్నిస్తుండగా.. బస్సు ఆపుతామని చెప్పినా పట్టించుకోకుండా కిందకు దూకాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిడిని మెరుగైన చికిత్స కోసం కడప పట్టణంలో రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

ఆటో డ్రైవర్‌కు దేహశుద్ధి

చాగలమర్రి: మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆంథోని సోమవారం రాత్రి మద్యం మత్తులో ఆదే గ్రామానికి చెందిన మహిళను దుర్భాషలాడడని స్థానికులు చితకబాదారు. అయితే అక్కడే పికెటింగ్‌లో విధులు నిర్వహిస్తున్న వీరాంజనేయులు అనే ఏఆర్ కానిస్టేబుల్.. ఆంథోనిని చాగలమర్రి పోలీస్ స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు. అంతలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కొందరు కార్యకర్తలు పోలీసు స్టేషన్ చేరుకొని పోలీసుల అదుపులో ఉన్న ఆంథోనిపై మూకుమ్మడిగా దాడి చేశారు. దాడిని నివారించటానికి ప్రయత్నించిన పోలీసులపై కూడా తిరగబడ్డారు. విచారించి చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.



రుద్రవరం ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



క్రిష్టిపాడులో..



శిరివెళ్లలో ఈద్గా వద్ద నమాజు చేస్తున్న ముస్లింలు



చాగలమర్రిలో పండుగ ప్రాశస్త్యాన్ని వినిపిస్తున్న ముల్లా ముజీబుర్ రెహ్మాన్

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

- నియోజకవర్గ వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో బక్రీద్ పర్వదిన వేడుకలు
- ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు
- ప్రార్థనా మందిరాల్లో మత గురువుల ప్రవచనాలు

ఆళ్లగడ్డ: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం బక్రీద్ పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆయా ప్రార్థనా మందిరాల్లో మత గురువుల ఆధ్వర్యంలో ఖురాన్ ప్రవచనాలు విని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. మత బోధకులు మాట్లాడుతూ త్యాగధనుడు ఇబ్రహీం ప్రవక్త స్ఫూర్తితో సాటివారి కోసం తనకు ఉన్నంతలో ఎంతో కొంత త్యాగం చేసే గుణాన్ని అలవరచుకోవాలని ఈదుల్ అజ్‌హా పర్వదిన పరమార్థమని సూచించారు.

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ముస్లింలు అల్లాను ధ్యానిస్తూ మసీదులు, ఈద్గాల వద్దకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ మత పెద్దలు ప్రార్థనలు చేయించి బక్రీద్ పండుగ ప్రత్యేకతను వివరించారు. ప్రార్థనలు ముగియగానే తిరుగుబాటలో అక్కడికొచ్చిన పేదలకు తోచినంత సాయం చేశారు. ఇళ్లకు చేరుకున్న అనంతరం పండుగా ఆనవాయితీ ప్రకారం కొందరు ఖుర్బానీ పంచి పెట్టారు.

ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

దొర్నిపాడు: త్యాగానికి ప్రతీకగా పిలుచుకునే బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా దొర్నిపాడు, క్రిష్టిపాడు, చాకరాజువేముల, గుండుపాపల, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, బుర్రారెడ్డిపల్లె, కొండాపురం గ్రామాల్లో ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఆళ్లగడ్డ మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: మండలంలో సోమవారం బక్రీద్ పండుగ ఘనంగా జరిగింది. శిరివెళ్ల, యర్రగుంట్ల, కోటపాడు, బోయలకుంట్ల, మహదేవపురం, చెన్నూరు, వనికినిదిన్నె, జీనేపల్లెలో ముస్లింలు మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజు చేశారు. అనంతరం ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్ఐ సురేష్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చాగలమర్రి: ప్రవక్త ఇబ్రహీం కుమారుడు ఇస్మాయిల్ జబీవుల్లా త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పండుగ పర్వదినాన్ని సోమవారం మండలంలోని ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. చిన్నమకానం వద్దనున్న అరబ్ మస్జిద్ నుంచి తక్బీర్‌లు చదువుకుంటూ మెయిన్ బజార్ మీదుగా అడ్డవాగు వద్ద ఉన్న ఈద్గా చేరుకొని ప్రత్యేక నమాజులు చేశారు. మత గురువులైన ఇమాం హాఫీజ్ ముల్లా



ఉయ్యాలవాడ ఈద్గా వద్ద దువా చేస్తున్న ముస్లింలు

ముజీబుర్ రెహ్మాన్, ఖాజీ ముల్లా యూనుస్ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్, దువా కార్యక్రమం జరిగింది. ఇంటికి చేరుకున్న అనంతరం ఖుర్బానీని పంపిణీ చేశారు. ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



చాగలమర్రిలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

ఉయ్యాలవాడ : త్యాగాన్ని, సహనాన్ని, దానగుణాన్ని పెంపొదించే బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో సోమవారం ముస్లింలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని నూరాన్ మసీద్, జామియా మసీదుల నుంచి ఇబ్రహీం, ఇస్మాయిల్, జబీదుల్లా త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీగా కుందూనది ఒడ్డునున్న ఈద్గా వద్దకు ఉదయం 8.30 గంటలకు చేరుకున్నారు. మౌలానా షంసులుద్దీన్ ముస్లింలతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఈ సందర్భంగా బక్రీద్ పండుగ విశిష్టతను క్లుప్తంగా వివరించారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టీడీపీ కన్వీనర్ బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు స్వీట్లు తినిపించి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల నాయకులు బోరెడ్డి నర్సిరెడ్డి, బోరెడ్డి దస్తగిరిరెడ్డి, మాజీ సొసైటీ ఉపాధ్యక్షుడు చింతా ప్రసాద్ పాల్గొన్నారు.



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

ఘనంగా బక్రీద్ వేడుకలు



ఎస్సార్బీసీ ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

నంద్యాల(వ్యవసాయం): బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రవక్త హజరత్ ఇబ్రహీం అలైహిసలాం ఆయన కుమారుడు ఇస్మాయిల్ చేసిన త్యాగాలను స్మరించుకుంటూ పండుగ జరుపుకున్నారు. భీమవరం రస్తాలో ఆల్‌పుర్ఖాన ఈద్గాలో న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ముస్లిం మతపెద్దలు, ముస్లిం సోదరులు ప్రార్థనల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేకంగా మజీద్‌లు, ఈద్గాల వద్ద ప్రార్థనలు చేసి, అనంతరం కుర్బానీ నిర్వహించారు. త్యాగ నిరతతో పాటు మనోవాంచ, స్వార్థం, అసూయ, రాఘద్వేశాలను కూడా విడిచిపెట్టి మానవతను వెదజల్లాలన్నదే బక్రీద్ పండుగలోని అంతర్యమని స్థానిక జామియా మసీదు మౌలానా ఇమ్రాన్ అన్నారు. పట్టణంలోని భీమవరం రస్తాలోని ఆల్‌పుర్ఖానా ఇమాం మౌలానా హాఫీజ్ అబ్దుల్ హాదీ సాహెబ్ ఆధ్వర్యంలో, మూలసాగరం ఈద్గాలో మౌలానా మహబూబ్‌బాషా, సాయిబాబానగర్‌లోని ఖుబ్రా ఈద్గా అంజాద్‌బాషా సిద్ధిఖీ, ఎస్సార్బీసీ కాలనీకి వెళ్లే రహదారిలో తౌయిబా ఈద్గాల వద్ద ముఫ్తీ రఫీ సాహెబ్, జుమ్మామసీదు, అంటికోట మసీదు, గాంధీచౌక్ మసీదు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, డబరాల మసీదు ఉన్న మసీదులలో ముస్లింలు, ఇమాంలు ఉదయం 6.30గంటలకు, 7.30గంటలకు 9.30గంటలకు ఈదుల్ జుహా ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇమాంల సంఘం అధ్యక్షుడు అంజాద్‌బాషా సిద్ధిఖీ మాట్లాడుతూ ప్రతి మనిషి ప్రవక్త సూచించిన ఆధ్యాత్మిక ధర్మపథంలో జీవించాలని, ఓర్పు, సహనాన్ని పెంచుకొని స్వార్థ బుద్ధిని విడనాడాలని, అల్లాకు ఇష్టమైన కార్యక్రమాలు చేస్తూ జీవితాన్ని సార్థకం చేసుకోవాలని సూచించారు. ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



ఈద్గాలో ప్రార్థన చేస్తున్న వృద్ధుడు



బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పండుగను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.. అనంతరం విందు భోజనాలు ఆరగించి ఆనందం పంచుకున్నారు.



సాయిబాబా నగర్ కుబ్రా ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



చాపిరేవులలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



భానుడు అస్తమిస్తుండగా యజమాని లేకపోయినా ఇంటికి బయలుదేరిన గేదెలు, ఆవులు

పొద్దుగూకుతోంది..

దొర్నిపాడు: పొద్దుగూకేసరికి ఏ గూటి పక్షి ఆ గూటికి చేరాలని పెద్దలు చెబుతుంటారు. ఈ చిత్రంలో భానుడు మేఘాల చాటున అస్తమిస్తుండగా.. అప్పటి వరకు పొలాల్లో మేత మేస్తున్న గేదెలు, ఆవులు యజమాని లేకపోయినా ఇంటి బాట పట్టాయి. ప్రతి రోజూ యజమాని లేకపోయినా వాటంతకవే ఇంటికి వెళ్తాయని స్థానికులు చెప్పారు.

నిజాయితీ చాటుకున్న ఏజెన్సీ ఉద్యోగి


మహానంది: మిత్రులతో కలిసి మహానందికి స్వామివారి దర్శనార్థం వచ్చిన వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన గంగా శివప్రసాద్ తన మొబైల్‌ను పెద్ద నంది విగ్రహం వద్ద మరిచిపోయాడు. నంది వద్ద విధులు నిర్వహించే ఏజెన్సీ ఉద్యోగి రమేశ్ మొబైల్ గుర్తించి బాధితుడికి అప్పగించాడు. అతని నిజాయితీని అందరూ మెచ్చుకున్నారు.

రమణీయం.. మహానందీశ్వరుడి పల్లకోత్సవం

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, ఆంజనేయ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుదీర్చారు. బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో స్వామివార్ల పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. భక్తులు స్వామివారి పల్లకీని మోస్తూ భక్తిని చాటుకున్నారు.



మహానందిలో పల్లకీసేవ దృశ్యం



ముకుందాపురం వద్ద ఏపుగా పెరిగిన మొక్కజొన్న



హరినగరం వద్ద కళకళలాడుతున్న మినుము పైరు

పంటలు కళకళ

రుద్రవరం: మండలంలో ముందస్తు ఖరీఫ్‌లో భాగంగా సాగు చేసిన మినుము, మొక్కజొన్న, పత్తి, మిరప వంటి పంటలన్నీ కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌నకు కాస్త ముందే వర్షాలు కురవడంతో రైతులు సేద్యపు పనులన్నీ పూర్తి చేసి ముందస్తుగానే పంటలు సాగు చేశారు. అప్పటి నుంచి వర్షాలు బాగా కురుస్తుండటంతో పంటలు పచ్చదనం పులుముకొని ఏపుగా పెరుగుతున్నాయి. ప్రధానంగా నర్సాపురం, ఆలమూరు, చిత్రేనిపల్లె, ముకుందాపురం, హరినగరం,సుగాలి తండా, రుద్రవరం, రెడ్డిపల్లె, టీ.లింగదిన్నె తదితర గ్రామాల పరిధిలో పంటలు సాగు చేశారు.

రేపు మాన్యం కౌలుకు వేలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేట ఆంజనేయ కోదండరామస్వామి దేవస్థానం, మూలసాగరంలోని శ్రీరామస్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి, భీమలింగేశ్వరస్వామి దేవస్థానం భూముల వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ రామాంజనేయ శర్మ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 19వ తేదీ ఉదయం 10గంటలకు బయటి పేట ఆంజనేయస్వామి, కోదండరామస్వామి దేవస్థానంలో ఉదయం 10గంటలకు వేలం నిర్వహిస్తారని, అదే రోజు సాయంత్రం 4గంటలకు మూలసాగరంలో వెలసిన శ్రీరామస్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కూడా వేలం ఉంటుందని చెప్పారు. 20వ తేదీన మూలమఠం శ్రీభీమేశ్వరస్వామి దేవస్థానం భూములు మూడు సంవత్సరాల కాలపరిమితికి కౌలుకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు రూ.2వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు.

అదనపు పనులు చేయించరాదు

నంద్యాల(న్యూటౌన్): ఆశా కార్యకర్తలతో అదనపు పనులు చేయించరాదని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నాగమణి అధ్యక్షతన నంద్యాల జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారి మాట్లాడుతూ అదనపు పనులు చేయించరాదని, ప్రభుత్వం సర్క్యులర్ ఇచ్చినా అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బాలవెంకట్, ప్రభావతి, నాగలక్ష్మి, చెన్నమ్మ, సరస్వతి, కృపావతి, సుమలత, లక్ష్మీదేవి, జయమ్మ, చిన్నమ్మ, పద్మావతి, రాజేశ్వరి, విజయమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి సుందరకాండ ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో 18 నుంచి 19వ తేదీ వరకు రెండు రోజుల పాటు సుందరకాండ ప్రవచనాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి, ఈఓ నాగప్రసాద్ సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 7గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైల దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు ప్రవచనాలు వినిపిస్తారని చెప్పారు.